సాక్షి
నల్లగొండ
శనివారం । 11 । జనవరి । 2025





వీటీ కాలనీలోని వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు


రామగిరి రామాలయంలో స్వామివారికి హారతితో నీరాజనం పలుకుతున్న భక్తులు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా శుక్రవారం నల్లగొండలోని రామగిరి రామాలయంలో స్వామి వారిని ఉత్తరద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

## సీఎం సమావేశంలో కలెక్టర్


హైదరాబాద్‌లోని సచివాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో పాల్గొన్న నల్లగొండ కలెక్టర్ ఇలా త్రిపాఠి

## నేడు నాగార్జునసాగర్‌కు ఉప ముఖ్యమంత్రి, మంత్రుల రాక

నల్లగొండ, నాగార్జునసాగర్ : నాగార్జునసాగర్‌కు శనివారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రానున్నారు. వారు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో ఉదయం 10.15కు నాగార్జునసాగర్ చేరుకుంటారు. సాగర్‌లోని ప్రాజెక్టు హౌజ్ అతిథి గృహంలో నిర్వహిస్తున్న ఎంపవర్‌మెంట్ ట్రైయినింగ్ ప్రోగ్రాం ఫర్ ఆదివాసీ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, మంత్రులు మాట్లాడతారు. 15 రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నారు. మధ్యాహ్నం 1.45 గంటలకు హైదరాబాద్‌కు బయల్దేరి వెళ్తారు. ఉప ముఖ్యమంత్రి, మంత్రుల రాక సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, తెలంగాణ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్ తెలిపారు.

**భారీ బందోబస్తు**

ఉప ముఖ్యమంత్రి, మంత్రుల రాక సందర్భంగా పోలీస్ యంత్రాంగం భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. స్థానిక బీసీ స్కూల్‌లో గల హెలిపాడ్‌ను పోలీసులు బాంబ్‌స్క్వాడ్ తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. ప్రాజెక్టు హౌజ్ సమీపంలోని వీధుల్లో డాగ్‌స్క్వాడ్స్‌తో తనిఖీ చేశారు.

## న్యూస్‌రీల్

### 12న బీఆర్‌ఎస్ మహాధర్నా

- హాజరుకానున్న మాజీమంత్రి కేటీఆర్

నల్లగొండ టూటౌన్ : రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరికి నిరసనగా ఈ నెల 12న ఆదివారం నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్లో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాధర్నాకు ముఖ్య అతిథిగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరవుతున్నారని.. రైతులు, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

### మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా మాధవి



నల్లగొండ : మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలిగా గోపగాని మాధవి నియమితులయ్యారు. ఈ మేరకు మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కమిటీ నుంచి శుక్రవారం ప్రకటన వెలువడింది. జిల్లా అధ్యక్షురాలిగా మాధవి రెండవసారి నియామకం కావడంపై ఆ పార్టీ నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

### జర్మనీలో డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తులు

నల్లగొండ : జర్మనీ దేశంలో బస్ డ్రైవర్లుగా పని చేయడానికి తెలంగాణ ఓవర్‌సిస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టీఓఎంసీఓఎం) కింద రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ దరఖాస్తులు ఆహ్వానిస్తోందని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్. పద్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్ డ్రైవర్ కోసం దరఖాస్తు చేసే అభ్యర్థులు పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు రెండు సంవత్సరాల డ్రైవింగ్ అనుభవంతో లైసెన్స్ కలిగి ఉండాలని, 24 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలని సూచించారు. వివరాలకు ఫోన్ నంబర్‌ను 9440052592 సంప్రదించాలని పేర్కొన్నారు.

### నిరుద్యోగ భృతి ఇవ్వాలని ధర్నా


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం మహేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం 2లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వయసు పెంపు ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు.అనంతరం కలెక్టరేట్‌లో డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వడ్డగాని మహేష్, గుండాల నరేష్, పోలాది కార్తీక్, కె. రాము, పోగు నవదీప్, కళ్యాణ్, ఎండీ.షరీఫ్, రావణ్, సందీప్, యశ్వంత్, రోహిత్ పాల్గొన్నారు.

# హైవేపై పనులు.. ప్రయాణానికి చిక్కులు!

## హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై పెరిగిన సంక్రాంతి రద్దీ

- ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్ల పనులతో ఇప్పటికే స్తంభిస్తున్న ట్రాఫిక్
- పండుగ రద్దీ మరింత పెరిగితే జటిలం కానున్న ట్రాఫిక్ సమస్య
- క్రాసింగ్‌లు, బ్లాక్ స్పాట్ల వద్ద స్టాపర్లు, స్పీడ్ బ్రేకర్లతో ట్రాఫిక్ నియంత్రణ
- టోల్‌గేట్లు, జంక్షన్ల వద్ద నేషనల్ హైవే సిబ్బంది, పోలీసుల పర్యవేక్షణ

**సంక్రాంతి సందడి మొదలైంది. హైదరాబాద్ నుంచి చాలా కుటుంబాలు శుక్రవారం సాయంత్రం నుంచే సొంతూళ్లకు బయలుదేరాయి. ఈ నాలుగైదు రోజులు హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై రద్దీ విపరీతంగా పెరగనుంది. అయితే జిల్లాలో జాతీయ రహదారిపై ప్రమాదకరంగా ఉన్న బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు, జంక్షన్ల అభివృద్ధి, వెహికిల్ అండర్ పాస్, రెండు వైపులా సర్వీస్ రోడ్డు పనులు ప్రారంభించారు. సాధారణ రోజుల్లోనే ఆయా ప్రాంతాల్లో వాహనాల రద్దీతో ఇబ్బందులు ఏర్పడుతుండగా.. ఇప్పుడు భారీగా వాహనాలు తరలివస్తే ట్రాఫిక్ అంతరాయం ఏర్పడనుంది.**

- చౌటుప్పల్, చిట్యాల, కేతేపల్లి, సూర్యాపేట టౌన్

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో హైదరాబాద్ - విజయవాడ 65వ నంబర్ జాతీయ రహదారిపై పలు ప్రాంతాల్లో నిత్యం ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం వాటిల్లుతోంది. నిత్యం ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి అక్కడ అండర్ పాస్, ఫ్లై ఓవర్లు, సర్వీస్‌రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. చౌటుప్పల్, చిట్యాలలో అండర్‌పాస్‌ల నిర్మాణం చేపట్టనున్నారు. ప్రస్తుతం చౌటుప్పల్‌లో డ్రెయినేజీ పనులు సాగుతున్నాయి. చిట్యాలలో మార్కింగ్ చేశారు. ఇక సూర్యాపేట ప్రాంతంలో ఫ్లై ఓవర్ నిర్మాణం ప్రారంభించడంతో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నారు. చాలా చోట్ల క్రాసింగ్‌ల వద్ద స్టాపర్లు ఏర్పాటు చేశారు. పలుచోట్ల స్పీడ్ బ్రేకర్స్ వేశారు. ఇక, టోల్‌గేట్లు, జంక్షన్ల వద్ద నేషనల్ హైవే సిబ్బంది, పోలీసులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టనున్నారు.


చౌటుప్పల్‌లో శుక్రవారం రాత్రి హైవేపై బారులుదీరిన వాహనాలు

### చౌటుప్పల్‌లో మొదటి రోజే తంటాలు

హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై పండుగ రద్దీ మొదలుకావడంతో చౌటుప్పల్ పట్టణంలో మొదటి రోజే ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. గతంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న సమయంలో వాహనాలు జాతీయ రహదారిపై నుంచే కాకుండా సర్వీస్ రోడ్ల వెంబడి సైతం రాకపోకలు సాగించాయి. దాంతో కొంత మేరకు ఇబ్బందులు తప్పేవి. ప్రస్తుతం పట్టణంలో అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా సర్వీస్ రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీలు పనులు కొనసాగుతుండడంతో ఎక్కడికక్కడ గుంతలు ఏర్పడి, మట్టి కుప్పలు పేరుకుపోయి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అయినా వాహనదారులు తప్పనిసరి పరిస్థితుల్లో జాతీయ రహదారి మీదుగానే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఇక చౌటుప్పల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఎదుట జాతీయ రహదారిపై ఉన్న జంక్షన్ నుంచి బస్సులతో పాటు స్థానిక వాహనాలు, ప్రజానీకం రోడ్డు దాటాలి. ఈ క్రమంలో పోలీసులు హైవేపై వచ్చే వాహనాలను కాసేపు నిలిపివేయక తప్పడం లేదు. ఐదు నిమిషాలు వాహనాలు ఆగితే అర కిలోమీటర్ ట్రాఫిక్ స్తంభించిపోతుంది.

### క్రాసింగ్‌లు, బ్లాక్ స్పాట్లలో స్టాపర్లు..

- చిట్యాల మండలంలో గుండ్రాంపల్లి శివారులోని మూలమలుపు వద్ద, వెలిమినేడు పరిధిలోని అంజనేయ స్వామి ఆలయం వద్ద, వెలిమినేడు నుంచి పిట్టంపల్లి గ్రామానికి వెళ్లే క్రాసింగ్ వద్ద, పెద్దకాపర్తి శివారులోని గాంధీ గుడి సమీపంలోని క్రాసింగ్ వద్ద, చిట్యాల పట్టణంలోని బస్‌స్టేషన్ ఎదురుగా, పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల క్రాసింగ్ వద్ద, రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారి వద్ద, వట్టిమర్తి బస్‌స్టేజీ వద్ద బ్లాక్ స్పాట్లు ఉన్నాయి. ఆయా చోట్ల స్టాపర్లను ఏర్పాటు చేశారు.
- నార్కట్‌పల్లి మండలంలోని వారిజాల వేణుగోపాలస్వామి దేవాలయానికి వెళ్లే ఆర్చీ సమీపంలోని డివైడర్ వద్ద, ఏపీ లింగోటం సమీపంలోని ఫ్లై ఓవర్ చివరి ప్రాంతాన్ని బ్లాక్ స్పాట్లుగా గుర్తించి.. రాత్రి సమయంలో లైటింగ్ ఏర్పాటు చేశారు.
- నకిరేకల్ పట్టణంలోకి వచ్చే.. వెళ్లే కూడళ్లలో ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. పద్మానగర్ వద్ద గడిచిన ఆరేళ్లలో పదుల సంఖ్యలో ప్రమాదాలు జరగడంతో ఆ ప్రాంతాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తించారు.
- కేతేపల్లి మండలంలోని కొర్లపహాడ్, ఇనుపాముల, చీకటిగూడెం జంక్షన్లను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించారు. ఇనుపాముల వద్ద సర్వీసురోడ్ల నిర్మాణానికి రూ.6 కోట్లు మంజూరయ్యాయి. నాలుగు నెలల క్రితం ఈ ప్రారంభమయ్యాయి. పూర్తి కావడానికి మరో నాలుగు నెలల సమయం పట్టే అవకాశముంది. మిగతా జంక్షన్ల మూడంచెల స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. రాత్రివేళ వాహనదారులకు కనిపించే విధంగా రెండు వైపులా బ్లింక్ లైట్లు ఏర్పాటు చేశారు.
- సూర్యాపేట జిల్లాలో ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి జనగాం క్రాస్ రోడ్డు వరకు, ఈనాడు జంక్షన్, దురాజ్‌పల్లి, ముకుందాపురం, ఆకుపాముల, కొమరబండ క్రాస్ రోడ్డు, కట్టకొమ్ముగూడెం, రామాపురం క్రాస్ రోడ్డుల వద్ద సర్వీస్ రోడ్లు, జంక్షన్‌ల అభివృద్ధి పనులను ప్రారంభించారు.
- కోదాడ మండలం, పట్టణ పరిధిలో కొమరబండ నుంచి రాష్ట్ర సరిహద్దు రామాపురం క్రాస్‌రోడ్ వరకు 17 కిలోమీటర్ల పరిధిలో కొమరబండ జంక్షన్, కట్టకొమ్ముగూడెం, శ్రీరంగాపురం, దుర్గాపురం, చిమిర్యాల, నల్లబండగూడెం, రామాపురం వరకు ఏడు క్రాసింగ్‌లు ఉన్నాయి. రామాపురం క్రాస్‌రోడ్‌లో తప్ప ఎక్కడా శుక్రవారం వరకు బారికేడ్లు ఏర్పాటు చేయలేదు. మునగాల మండలం ఆకుపాముల నుంచి కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్ వరకు నలుగురు ఎస్‌ఐలు, 12 మంది సిబ్బందితో పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.


ఇనుపాముల స్టేజీ వద్ద ఏర్పాటు చేసిన బ్లింక లైట్

### సూర్యాపేట పట్టణంలో జటిలం

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి జనగాం క్రాస్ రోడ్డు వరకు ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాలు పిల్లలమర్రి స్టేజీ దాటగానే సర్వీస్ రోడ్డు వెంట జనగాం క్రాస్ రోడ్డు వరకు వచ్చి అక్కడ నుంచి జాతీయ రహదారిపై నుంచి వెళ్తున్నాయి. అలాగే విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు అంజనాపురి కాలనీ దాటగానే సర్వీస్ రోడ్డు నుంచి వెళ్లి ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల దాటాక జాతీయ రహదారిపై వెళ్తున్నాయి. అలాగే సూర్యాపేట పట్టణం నుంచి జనగాం వైపు వెళ్లే వాహనాలు పిల్లలమర్రి స్టేజీ వద్ద నుంచి యూటర్న్ తీసుకొని జనగాం క్రాస్ రోడ్డు గుండా వెళ్తున్నాయి. అలాగే జనగాం వైపు నుంచి సూర్యాపేటకు వచ్చే వాహనాలు అంజనాపురి కాలనీ నుంచి పట్టణంలోకి వస్తున్నాయి. దీంతో ఇప్పటికే కొంత ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఈ నాలుగైదు రోజులు వాహనాల రద్దీ విపరీతంగా పెరిగితే.. జనగాం క్రాస్ రోడ్డు వద్దకు ట్రాఫిక్ సమస్య జటిలం అయ్యే అవకాశాలు ఉన్నాయి.


జనగాం క్రాస్ రోడ్డులో సర్వీస్ రోడ్డు వెంట వెళ్తున్న వాహనాలు

### ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తాం

ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాల నుంచి జనగాం క్రాస్ రోడ్డు వరకు ప్రస్తుతం ఫ్లెఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. సర్వీసు రోడ్డు పైనుంచి వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. సంక్రాంతి సందర్భంగా వాహనాల రద్దీ పెరగనున్న నేపథ్యంలో అదనపు సిబ్బందిని నియమించి సమస్య లేకుండా చేస్తాం. రద్దీ పెరిగితే వెంటనే టేకుమట్ల నుంచి కొన్ని వాహనాలను డైవర్షన్ చేసి అటు నుంచి బాలెంల ఫ్లెఓవర్ వద్ద నుంచి మళ్లించి అంజనాపురి కాలనీ నుంచి విజయవాడ వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటాం. టేకుమట్ల నుంచి ఖమ్మం హైవే మీదుగా పాలేరు వద్ద గల నాయకన్‌గూడెం నుంచి విజయవాడకు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటాం.

- నాగేశ్వర్‌రావు, అదనపు ఎస్పీ, సూర్యాపేట

### తెలంగాణ - ఏపీ సరిహద్దులో పాలేరు వంతెనపై రాకపోకలు

కోదాడ రూరల్ : తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో కోదాడ మండల శివారులోని పాలేరు వాగుపై ఇటీవల తెగిన వంతెనకు అధికారులు శుక్రవారం తాత్కాలికంగా మరమ్మతులు చేశారు. పండుగ సందర్భంగా రద్దీని నియంత్రించేందుకు పాత వంతెన పైనుంచి కూడా వాహనాలను అనుమతిస్తున్నారు. దీంతో అక్కడ వాహనాలు సాఫీగా వెళ్తున్నాయి. ఇప్పటి వరకు అక్కడ ట్రాఫిక్ వన్‌వేలోనే వెళ్లింది.


పాలేరువాగు వంతెనపై నుంచి రెండు వైపులా వెళ్తున్న వాహనాలు


చిట్యాలలో హైవేపై విజయవాడ వైపు వాహనాల రద్దీ

## బస్టాండ్ కిటకిట

రామగిరి(నల్లగొండ) : సంక్రాంతి సెలవులు రావడంతో సొంతూళ్లకు వెళ్లేందుకు వచ్చిన ప్రయాణికులు, విద్యార్థులతో నల్లగొండ బస్టాండ్ రద్దీగా మారింది. రద్దీ ఎక్కువగా ఉండడంతో బస్సులు ఎక్కే సమయంలో చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు.


బస్సు ఎక్కేందుకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు


నల్లగొండలోని బస్టాండ్ ప్లాట్ ఫామ్‌లపై బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

## పెద్దగట్టు జాతరను తెలంగాణ పండుగగా గుర్తించాలి

నల్లగొండ టౌన్ : పెద్దగట్టు జాతరను తెలంగాణ రాష్ట్ర పండుగగా గుర్తించాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ కోరారు. శుక్రవారం నల్లగొండలోని యాదవ సంఘం భవనంలో అఖిలభారత యాదవ మహాసభ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎల్.గోవర్ధన్, నాయకులు సుధాకర్‌యాదవ్, ఎల్వియాదవ్, చందు యాదవ్, పద్మ, అల్లి వేణుయాదవ్, కాశీ రాములు, చీర పంకజ్‌యాదవ్, పిల్లి రామరాజుయాదవ్, పర్వతాలు, బెల్లి నాగరాజుయాదవ్, శివయాదవ్, తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యాదవ మహాసభ నాయకులు

## 'దర్వేశిపురం' పాలకమండలి ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలకమండలి సభ్యులు

కనగల్ : మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం శుక్రవారం జరిగింది. చీదేటి వెంకట్‌రెడ్డి ఆలయ చైర్మన్‌గా.. 14 మంది కమిటీ సభ్యులుగా బాధ్యతలు చేపట్టారు. వీరితో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ భాస్కర్ ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ జల్లెపల్లి జయరామయ్య, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ రమేష్‌గౌడ్, గుమ్మల మోహన్‌రెడ్డి, అనూప్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ సుమతి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### యాదగిరి క్షేత్రంలో విక్టోరియా ఎంపీ పూజలు



నృత్య కళాకారులతో ఎంపీ జాన్ ములాహి

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని ఆస్ట్రేలియాలోని విక్టోరియాకు చెందిన ఎంపీ జాన్ ములాహి శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు పూజలు చేశారు. జాన్ ములాహికి అర్చకులు ఆశీర్వచనం చేశారు.

### బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జలాల్‌పురంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నామని సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల కాలవ్యవధి గల 'బేసిక్ బ్యూటీషియన్' కోర్సుకు పదో తరగతి, మూడు నెలల కాలవ్యవధి గల 'అడ్వాన్స్ బ్యూటీషియన్' కోర్సుకు పదో తరగతి విద్యార్హతతో పాటు బేసిక్ బ్యూటీషియన్ నేర్చుకొని ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 20న సంస్థలో నిర్వహించే ప్రవేశాల కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు భోజనంతో కూడిన ఉచిత హాస్టల్ వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యువతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 91339 08000, 91339 08111 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

### లారీ ఢీకొని మహిళ మృతి

రామన్నపేట: రామన్నపేట పట్టణ శివారులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. రామన్నపేట ఎస్ఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తుమ్మలగూడెం గ్రామానికి చెందిన జిల్లాల వెంకటేశం ఆయన భార్య సుభద్ర(50) బైక్‌పై రామన్నపేట పట్టణానికి బయలుదేరారు. రామన్నపేటలో చేపల మార్కెట్ వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెనుక కూర్చున్న సుభద్ర అదుపుతప్పి రోడ్డుపై పడగా ఆమె తల మీదుగా లారీ వెనక టైర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి భర్త వెంకటేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఆత్మకూరు(ఎం): మండలంలోని రాయిపల్లి వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన దేవరబోయిన శ్రీను మృతి చెందాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయిపల్లికి చెందిన దేవరబోయిన శ్రీనివాస్(50) ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో కూలీ పని చేసి తిరిగి స్వగ్రామానికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం పని ముగిసిన అనంతరం ఎక్సెల్ వాహనంపై రాయిపల్లికి వెళ్తున్నాడు. రాయిపల్లి స్టేజీకి సమీపంలో మరో ఐదు నిముషాల్లో ఇంటికి వెళ్తాడనగా.. భువనగిరి నుంచి ఆత్మకూరు(ఎం)కు వస్తున్న అశోక్ లేలాండ్ వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.



పాతగుట్ట ఆలయంలో స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు



గరుడవాహనంపై వైకుంఠ నాథుడిగా దర్శనం ఇచ్చిన స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

# వైకుంఠ వైభవం



యాదగిరిగుట్టలోని శ్రీలక్ష్మీనారసింహుడి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి హాజరైన భక్తులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్టలో శ్రీలక్ష్మీనరసింహుడు శుక్రవారం భక్తులకు వైకుంఠనాథుడిగా దర్శనమిచ్చారు. యాదగిరీశుడి ప్రధానాలయ ఉత్తర ద్వారం గుండా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం ఆళ్వారాధుల సేవను అర్చకులు ఉత్తర ద్వారం నుంచి తీసుకువచ్చి ప్రత్యేక వేదికపై అధిష్టించారు. అనంతరం గరుడ వాహనంపై వైకుంఠ నాథుడిగా శ్రీలక్ష్మీనరసింహస్వామిని అలంకారంలో ఊరేగింపుగా ప్రధానాలయం ప్రథమ ప్రాకారం నుంచి ఉత్తర ద్వారం వద్దకు తీసుకువచ్చి పంచారాత్రా ఆగమ శాస్త్రం ప్రకారం పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అదేవిధంగా ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న పూర్వగిరి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం, ఆరాధన చేపట్టారు. శ్రీస్వామిని గరుడ వాహనంపై ప్రత్యేక సేవలో ఉత్తర ద్వారంకు తీసుకువచ్చారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వేడుకల్లో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు దంపతులు, ఐఏఎస్ కృష్ణ భాస్కర్, ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త నర్సింహమూర్తి, ఆలయాధికారులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

### స్వర్ణగిరి క్షేత్రంలో ముక్కోటి శోభ

భువనగిరి: పట్టణ శివారులోని స్వర్ణగిరి క్షేత్రంలో ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి స్వామి వారిని దర్శించుకున్నారు. అంతకు ముందు వారికి ఆలయ ధర్మకర్తలు మానేపల్లి రామారావు, మురళీ కృష్ణ, గోపి కృష్ణ వారికి స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు. వారి వెంట పీసీసీ డెలిగేట్ సభ్యులు తంగళ్లపల్లి రవికుమార్ ఉన్నారు.



స్వర్ణగిరి క్షేత్రంలో నిర్వహించిన గీతాలాపనలో పాల్గొన్న మంగ్లీ

### గరుడవాహనంపై శ్రీస్వామి వారి గ్రామోత్సవం

మఠంపల్లి: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో శుక్రవారం తెల్లవారుజామున స్వామివారు వైకుంఠ(ఉత్తర) ద్వార దర్శనమిచ్చారు. గర్భాలయంలోని శ్రీ స్వామి మూల విరాట్‌ను భక్తులు దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్య హోమం పూర్తిగావించారు. అదేవిధంగా లక్ష ఆరెపత్రి పూజ జరిపించారు. అనంతరం శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారికి గరుడ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.



శ్రీలక్ష్మీనారసింహుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

## రేవంత్‌ని తిడితే బండి సంజయ్‌కు కోపమెందుకో..

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేట టౌన్: సీఎం రేవంత్‌రెడ్డిని తిడితే కాంగ్రెస్ నేతలకు రాని కోపం.. కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఎందుకు వస్తుందో చెప్పాలని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన సూర్యాపేట జిల్లా కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. బండి నిజంగా బీజేపీ రక్తమైతే రేవంత్ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. రేవంత్, బండి సంజయ్ మధ్య అంతర్గత లావాదేవీలున్నాయనే రాష్ట్ర అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పించారని బీజేపీ నేతలే ఆరోపించారని అన్నారు. హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న రేవంత్‌ని బీజేపీ ఏనాడూ నిలదీయలేదని దుయ్యబట్టారు. కేంద్రంలో కాంగ్రెస్‌ని వ్యతిరేకిస్తున్న బీజేపీ.. రాష్ట్రంలో ఎందుకు స్పందించడం లేదన్నారు. కాంగ్రెస్‌ని వదిలి బీఆర్ఎస్, కేసీఆర్‌పై బీజేపీకి ఎందుకు విషప్రచారం చేస్తోందన్నారు. ప్రజలను మోసం చేయడంలో కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనన్నారు. చివరకు ఈ ఫార్ములా కేసులో రేవంతే జైలుకు వెళతాడని అన్నారు.

## ఆధ్యాత్మిక జ్ఞానమే ఏకైక మార్గం

- బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం జనరల్ సెక్రటరీ రాజయోగి బృజ్ మోహన్

భీబీనగర్: ప్రస్తుత సమాజంలో సమస్యల రుగ్మతను రూపుమాపి సుఖశాంతులకు దోహదపడే ఏకైక మార్గం ఆధ్యాత్మిక జ్ఞానం అని బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయం జనరల్ సెక్రటరీ రాజయోగి బీకే బృజ్ మోహన్ బాయిజీ అన్నారు. బీబీనగర్ మండలంలోని మహదేవ్‌పురం గ్రామ పరిధిలో గల బ్రహ్మకుమారీస్ సైలెన్స్ రిట్రీట్ సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా స్పిరిచువల్ సర్వీస్ ట్రెనింగ్ కాంప్లెక్స్ ప్రభులీలా భవనాన్ని ఆయన సంస్థ జాయింట్ చీఫ్ రాజయోగిని బీకే సంతోష్ దీదీతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. శాంతి స్థాపనకు ప్రపంచ వ్యాప్తంగా బ్రహ్మకుమారీస్ సంస్థ కేంద్రాలను నెలకొల్పుతున్నామన్నారు. బ్రహ్మకుమారీస్ ద్వారా చేస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ సంస్థ డైరెక్టర్లు బీకే రాజ్‌కుమారి, బీకే సునిత, టీచర్లు పాల్గొన్నారు.



ప్రభులీలా స్పిరిచువల్ కాంప్లెక్స్ భవనాన్ని ప్రారంభిస్తున్న మోహన్ బాయిజీ

## రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

దేవరకొండ: రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి అన్నారు. శుక్రవారం దేవరకొండ పట్టణంలోని సాయిబాబా దేవాలయ ఆవరణలో రైతు లోకసాని పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్గానిక్ ప్రొడక్ట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ.. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఎదుళ్ల నుంచి డిండి ఎత్తిపోతల ప్రాజెక్టుకు నీటిని తీసుకొచ్చేందుకు ఇటీవల మంత్రి వర్గం ఆమోదించిందని తెలిపారు. ఎమ్మెల్యే బాలునాయక్ మాట్లాడుతూ.. దేవరకొండ నియోజకవర్గ పరిధిలో గల పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయితే నియోజకవర్గ సస్యశామలం అవుతుందన్నారు. ఇప్పటికే నక్కలగండి టన్నెల్ పనుల పూర్తికి ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. త్వరలోనే బేరింగ్ మిషన్ వస్తుందని మిషన్ రాకతో పనులు మొదలు పెట్టి పూర్తిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డి, కర్నాటి లింగారెడ్డి, సిరాజ్‌ఖాన్, పున్న వెంకటేశ్వర్లు, కాసర్ల వెంకటయ్య, గోవింద్ యాదవ్, శ్రవణ్ తదితరులున్నారు.



కోదండరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

### అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

చందూరు(గట్టుప్పల్) : అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. నల్లగొండ జిల్లా గట్టుప్పల్ మండల పరిధిలోని తేరట్‌పల్లి గ్రామానికి చెందిన గిరి యాదయ్య (50) వ్యవసాయంతో పాటు గీత కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇటీవల వ్యవసాయం పెట్టుబడికి కొంత అప్పు చేశాడు. పంట దిగుబడి సరిగ్గారాక చేసిన అప్పులు తీరక కొంత కాలంగా ఆందోళనగా ఉన్నాడు. బుధవారం పత్తి పంటకు వాడే క్రిమిసంహారక మందు తాగాడు. దీంతో అపస్మారక స్థితికి చేరడంతో కుటుంబ సభ్యులు నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యాదయ్య చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. కుటుంభ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి తెలిపారు.

## బారసాలకు వెళ్లొస్తుండగా ప్రమాదం

- నాగారం మండలం ఈటూరు గ్రామంలో విషాదఛాయలు



పేరాల వెంకన్న (ఫైల్)



పేరాల జ్యోతి (ఫైల్)

నాగారం: బారసాలకు వెళ్లొస్తుండగా.. సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై మైదంచెరువు తండా వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నాగారం మండలం ఈటూరు గ్రామానికి చెందిన ఇద్దరు దుర్మరణం చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈటూరు గ్రామానికి చెందిన పేరాల వెంకన్న కుమారుడు యుగేందర్‌కు కుమారుడు పుట్టడంతో జనగాం జిల్లా దేవరుప్పల మండలం కడవెండి గ్రామానికి కుటుంబ సభ్యులతో కలసి బారసాలకు వెళ్లారు. కార్యక్రమం పూర్తయిన అనంతరం మొత్తం 8 మంది కుటుంబ సభ్యులతో కలిసి వాహనంలో ఈటూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో సూర్యాపేట-జనగాం జాతీయ రహదారిపై మొండ్రాయి గ్రామ శివారులోని మైదంచెరువు తండా వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న డీసీఎం వాహనాన్ని తుఫాను వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పేరాల వెంకన్న(45), అతడి తమ్ముడి భార్య పేరాల జ్యోతి(35) అక్కడికక్కడే మృతి చెందారు. వాహనంలో ఉన్న పేరాల ఉషయ్య, పేరాల లక్ష్మి పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అలాగే వాహనంలో ఉన్న మరో నలుగురు వంగూరి నర్సమ్మ, పేరాల ఉప్పలమ్మ, పేరాల మమత, పేరాల ముత్యాలమ్మకు గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు శుక్రవారం మృతదేహాలకు నివాళులర్పించారు. ఇరువురి కుటుంబాలకు రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట మాజీ ఎంపీటీసీ చింతారెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు బుచ్చిబాబు, లింగయ్య, రమేష్, భిక్షం ఉన్నారు.

### గడ్డివాము దగ్ధం

నూతనకల్: గుర్తు తెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పంటించడంతో కాలి బూడిదైన సంఘటన నూతనకల్ మండల పరిధిలోని బిక్కుమళ్ల గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన సంపేట సుధాకర్ తన పశువుల మేత కోసం వ్యవసాయ బావి వద్ద నిల్వ ఉంచిన 600గడ్డి మోపులకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. దీంతో అవి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. ఈ ఘటనపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధిత రైతు ఫిర్యాదు చేశాడు.

### షార్ట్‌సర్క్యూట్‌తో ఇంటి సామగ్రి దగ్ధం

రాజాపేట: మండలంలోని కుర్రారం గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో సామగ్రి దగ్ధమైంది. మండలంలోని కొత్తజాల గ్రామానికి చెందిన చెప్పాల కిష్టయ్య కుర్రారం గ్రామంలోని ఓ ఇంటిలో అద్దెకు ఉంటున్నాడు. ప్రమాదవశాత్తు ఇంట్లో షార్ట్ సర్క్యూట్ కావడంతో సామగ్రితోపాటు రూ. 23వేల నగదు దగ్ధమైనట్లు తెలిపాడు.

### బైక్ ఢీకొని ఇద్దరికి గాయాలు

భువనగిరి: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన భువనగిరి మండలంలోని కూనూరు గ్రామం వద్ద చోటుచేసుకుంది. గుండాల మండలం రామారం గ్రామానికి చెందిన మల్లెపాక రాజేష్ తల్లి నర్సమ్మతో కలిసి బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని కూనూరు గ్రామం సమీపంలో మరో బైకు వేగంగా వచ్చి ఢీ కొట్టింది. దీంతో రాజేష్‌తో పాటు తల్లికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని 108 వాహనంలో భువనగిరిలోని ఆస్పత్రికి తరలించారు.

## విద్యుదుత్పాదన కేంద్రంలో రెండవ టర్బైన్ మరమ్మతు పూర్తి

నాగార్జునసాగర్: సాగర్ ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలోని రెండవ టర్బైన్ మరమ్మతు పనులు పూర్తయ్యాయి. జపాన్ నుంచి సాంకేతిక నిపుణులను పిలిపించారు. సుమారుగా రూ.30లక్షలు వ్యయం చేసి ఎట్టకేలకు మరమ్మతులు పూర్తిచేశారు. ప్రస్తుతం విద్యుదుత్పాదనకు సిద్ధంగా ఉన్నట్లు చీఫ్ ఇంజనీర్ మంగేష్‌కుమార్ తెలిపారు. గత ఏడాదిగా టర్బైన్ నిరుపయోగంగా ఉంది. రాష్ట్రంలో విద్యుత్ అవసరాలు పెరగడంతో ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని నవంబర్ మాసంలో సాంకేతిక నిపుణులను పిలిపించారు. మరమ్మతులు పూర్తికాగానే ట్రయల్‌రన్ చేసి చూశారు.

**810 మెగావాట్లు ఉత్పాదనకు సిద్ధం**

ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో 8టర్బైన్లు ఉన్నాయి. 7 టర్బైన్లు ఒక్కొక్కటి 100 మెగావాట్ల ఉత్పాదన సామర్థ్యం కలిగి ఉండగా.. ఒకటి 110 మెగావాట్ల సామర్థ్యం కల్గి ఉంది. ఇవి కాకుండా ఎడమ కాల్వపై రెండు టర్బైన్లు కలిపి 60 మెగావాట్ల సామర్థ్యం కల్గి ఉన్నాయి.



సాగర్ ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలోని టర్బైన్లు



# నిద్రలోనే తెల్లారిన బతుకులు

- బతుకుదెరువు కోసం హైదరాబాద్ వెళ్తున్న ఒడిశా రాష్ట్రానికి చెందిన కూలీలు
- లారీరూపంలో దూసుకొచ్చిన ప్రమాదం
- అక్కడికక్కడే నలుగురు, చికిత్స పొందుతూ మరొకరు మృతి, 19 మందికి గాయాలు
- తమతో వచ్చిన వారు తమ కళ్ల ఎదుటే మృతి చెందారని కన్నీటి పర్యంతం



ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో దెబ్బతిన్న ప్రైవేట్ ట్రావెల్ బస్సు ముందుభాగం



ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్

చివ్వెంల/సూర్యాపేటటౌన్: వాళ్లంతా రోజు వారీ కూలీలు. పని చేస్తే గాని కుటుంబాన్ని పోషించుకోలేని పరిస్థితి. అలాంటి కుటుంబ పెద్దలే మృత్యు ఒడిలోకి చేరుకోవడంతో ఆ కుటుంబాలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన 33 మంది కూలీలు అక్కడ పనులు లేక హైదరాబాద్‌కు వలస వెళ్తున్నారు. మరో రెండు గంటల్లో తాము పని చేసే చోటుకు చేరుకుంటామనగా రోడ్డుప్రమాదం వారిని కబళించింది. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండల పరిధిలోని ఐలాపురం గ్రామ శివారులో ఆంగోతుతండా సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఆగి ఉన్న ఇసుక లారీని ఢీకొట్టడంతో నలుగురు కూలీలు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో 20 మందికి గాయాలయ్యాయి. పలువురు కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలై మంచానికే పరిమితమయ్యే పరిస్థితి నెలకొంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి భార్యాభర్త మృతి చెందడంతో ఆ కుటుంబం పెద్దదిక్కును కోల్పోయింది. మరో వ్యక్తి తన పక్కనే కూర్చున్న భార్య చనిపోవడంతో అతను ఒక్కసారిగా స్పృహ కోల్పోయాడు. 17ఏళ్ల యువకుడికి ప్రమాదంలో లివర్ డ్యామేజ్ అయి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మృతి చెందాడు. తమతో వచ్చిన కూలీలు కళ్ల ముందే మృతి చెందడంతో విషాదంలో మునిగిపోయారు.



సునమని హరిజన్ మృతదేహం



సుల హరిజన్ మృతదేహం



రూపు హరిజన్ మృతదేహం

**సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ**

ప్రమాద ఘటన విషయం తెలుసుకున్న సూర్యాపేట ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ హుటాహుటిన అక్కడకు చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అదేవిధంగా డీఎస్పీ రవి, సీఐ రాజశేఖర్, ఎస్ఐలు మహేశ్వర్, బాలునాయక్‌లు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో జనరల్ హాస్పిట్‌లకు పంపించారు. మృతుడి బంధువు తల్వాడ లాభ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు.


### పనికోసం గోవాకు వెళ్తున్నాం



మేము ఒడిశా నుంచి హైదరాబాద్‌కు వెళ్లి అక్కడి నుంచి పని చేసేందుకు గోవా వెళ్తున్నాం. బస్సు డ్రైవర్ ఖమ్మం దాటగానే వాహనం వేగం పెంచినట్టు అనిపించింది. కానీ మేమంతా నిద్రలో ఉన్నాం. ప్రమాదం జరిగింది గుర్తు లేదు. లేచి చూసే సరికి ఏం జరిగిందో అర్థం కాలేదు.

– దంబరూదర్ ఫాణిగ్రహి, ప్రయాణికుడు, ఒడిశా

### తలకు, చేతులకు గాయాలయ్యాయి



బస్సు ఎక్కిన గంట తర్వాత నిద్రలోకి జారుకున్నాం. కళ్లు తెరిచే వరకు ప్రమాదం జరిగి పోలీసు వాహనాలు బస్సు ముందు ఉన్నాయి. బస్సులో డ్రైవర్‌తోపాటు ముగ్గురు వ్యక్తులు ఇరుక్కొని చనిపోయి ఉన్నారు. పోలీసులు కట్టర్ల సాయంతో కత్తిరించి బయటకు తీశారు. నా కాళ్లకు, చేతులకు గాయాలయ్యాయి.

– నరేంద్ర దలపతి, ఒడిశా, ప్రయాణికుడు

### అంబులెన్స్‌లో ఆస్పత్రికి తీసుకొచ్చారు



బస్సు ప్రమాదానికి గురి కాగానే మెలుకువ వచ్చింది. ఒక్కసారిగా భయపడ్డాం. ఏం జరిగిందో అర్థం కాలేదు. వెనుక సీటులో కూర్చొన్న ఇద్దరు నాపై పడ్డారు. దీంతో నేను సీటుకు గుద్దుకోవడంతో నా చేతి వేలుకు గాయమైంది. లేచి చూసే సరికి బస్సు అంతా ఒక వైపు నుజ్జునుజ్జయింది.

– లోకనాథ్, ప్రయాణికుడు, ఒడిశా

### మా అన్నయ్య కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది



ప్రమాదం జరగ్గానే బస్సులో ఉన్న హెల్పర్ ఒడిషాలో ఉన్న మా వదినకు ఫోన్ చేశాడు. ఆమె నాకు ఫోన్ చేసి అన్నయ్య ప్రమాదంలో చనిపోయాడని తెలపడంతో నేను వెంటనే సూర్యాపేట ఆస్పత్రికి వచ్చాను. మా అన్నయ్యకు నలుగురు పిల్లలు ఉన్నారు. ప్రమాదం వలన మా అన్నయ్య కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది.

– జనస్మార్బిన్, బస్సు డ్రైవర్ తమ్ముడు, ఒడిశా

### అందరూ నిద్రలో ఉన్నారు



ఒడిషా రాష్ట్రంలోని కురపుట్ జిల్లా కుంతా గ్రామం నుంచి నాతో పాటు మరో నలుగురం వచ్చాం. గురువారం సాయంత్రం 7గంటల సమయంలో బస్సు ఎక్కాం. రాత్రి కావడంతో బస్సులో అందరూ నిద్రలోకి జారుకున్నారు. ప్రమాదం జరిగినప్పుడు నాకు ఏం గుర్తు లేదు.

– టిలొబో, కురపుట్ జిల్లా, కుంతా గ్రామం, ఒడిశా